కలలకు వెన్యూ!! 2025

కొత్త ఏడాది. ఎన్నో ఆశలు..ఆకాంక్షలు..నూతన ఆలోచనలు..అవి సాధించేందుకు ప్రణాళికలు..ఇదే యువతరం మాట..బాట. ప్రతి ఏడాది లక్ష్యాలు నిర్దేశించుకోవడం.. వాటిని సాకారం చేసుకోవడం ఇదే యువత మంత్రం. విశాఖలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పలువురు విదేశీ విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకున్నారు. నూతన సంవత్సరాన్ని తాము స్నేహితులతో కలిసి జరుపుకుంటామని యువతీ యువకులు చెబుతున్నారు.

- ఏయూక్యాంపస్ / బీచ్‌రోడ్డు

'ప్రతి కలను కనులు స్వాగతిస్తాయి
ప్రతి కలను కళలు సాధిస్తాయి
దూరమెంతైనా ప్రయత్నం ముందు చిన్నదవుతుంది
నమ్మకమే గమ్యంవైపు నడిపిస్తుంది
గమ్యాన్ని చేరుస్తుంది'



పీహెచ్‌డీ చేస్తా..



ప్రస్తుతం పీజీ చేస్తున్నా. భారత్‌లో పీహెచ్‌డీ చేయాలని అనుకుంటున్నాను. కొత్త సంవత్సరం మరింత ఉత్సాహ భరితంగా ఉండాలని, ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షిస్తున్నా. ప్రస్తుతం ఎంసీఏ చదువుతున్నాను.

-అలీ సినా, ఆఫ్గనిస్తాన్ విద్యార్థి

రీసెర్చర్ అవ్వాలని ఉంది



నూతన సంవత్సరం అందరి జీవితాలలో సంతోషాన్ని నింపాలని కోరుకుంటున్నాను. ఇక్కడ చదువుకోవడానికి రావడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో మంచి రీసెర్చర్‌గా నిలవాలని అనుకుంటున్నాను.

-సంచిత రాజీ రాయ్, ఇంజనీరింగ్ విద్యార్థిని, బంగ్లాదేశ్

మంచి స్థానంలో ఉండాలి

నేను ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నా. మంచి స్థానంలో ఉండాలని ఈ నూతన సంవత్సరంలో కోరుకుంటున్నాను. అందుకు నిరంతరం శ్రమిస్తాను. కుటుంబ సభ్యులు, సహా ఉద్యోగుల సహకారంతో ఆ ఆకాంక్ష నేరవేరుతుంది అనుకుంటున్నాను.

-డి.భవ్య శ్రీ, ప్రైవేట్ ఉద్యోగిని, విశాఖ

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడాలనేది నా కోరిక. ప్రస్తుతం బీటెక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సు చేస్తున్నాను. న్యూ ఇయర్ రోజున స్నేహితులతో కలిసి బీచ్‌లో సరదాగా గడపాలని అనుకుంటున్నాను.

-తౌన్కకర, ఆంబోడియా విద్యార్థి

లక్ష్యాలు చేరుకుంటా..



నేను ఇథియోపియా నుంచి ఐసీఎస్ఆర్ స్కాలర్‌షిప్ సహాయంతో ఇండియాకు వచ్చాను. రెండు నెలల క్రితం నేను విశాఖకు వచ్చాను. ఇక్కడ అంతా బాగుంది. ప్రస్తుతం నా దృష్టి అంతా పీహెచ్‌డీ పూర్తిచేయడంపైనే ఉంది. ఈ లక్ష్యాన్ని పూర్తిచేయడానికి కష్టపడతాను.

-గెటిటీ, ఇథియోపియా విద్యార్థి

అందరికీ మంచి జరగాలి



ఈ నూతన సంవత్సరంలో నాకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును పొందాలి..స్నేహితులు, కుటుంబ సభ్యులు, సహోద్యోగుల సహకారంతో ఉద్యోగంలో ఉన్నతిని కోరుకుంటున్నా. కలలు సాకారం చేసుకునేందుకు ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నా..

-సంజన, ప్రైవేటు ఉద్యోగిని, విశాఖ

క్లుప్తంగా

ఆరిలోవ పోలీస్ స్టేషన్ సీపీ సందర్శన



ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలపై ఆరా తీస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. కొత్త పోలీస్ స్టేషన్‌లో సౌకర్యాలు పరిశీలించారు. ఇక్కడ నమోదవుతున్న కేసులు, పరిష్కారమైన కేసులు తదితర వాటి గురించి ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో సమస్యలు గురించి సీఐ మళ్లేశ్వరరావును అడిగి తెలుసుకొన్నారు. కేసులకు సంబంధించిన రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నగరంలో లా అండ్ ఆర్డర్ అదుపులో ఉంచే ప్రయత్నంలో అన్నీ పోలీస్ స్టేషన్‌లు తనిఖీలు చేపడుతున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆరిలోవ పోలీస్ స్టేషన్ సందర్శించినట్లు తెలిపారు.

ఎంవీపీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌ను నగర డీసీపీ అజిత వేజండ్ల సందర్శించారు. మంగళవారం సాయంత్రం పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ఆమె యాన్యువల్ తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. రికార్డులు, నేరాల నియంత్రణ, ఎఫ్ఐఆర్‌ల నమోదు, కేసుల పరిష్కారం, సిబ్బంది హాజరు నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ మురళీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడిని పరామర్శిస్తున్న జాన్ వెస్లీ

ఆరిలోవ: అనారోగ్యంతో బాధపడుతూ హెల్త్ సిటీ పినాకిల్ ఆస్పత్రిలో కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.గోవింద పట్నాయక్‌ను మంగళవారం ఆ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ పరామర్శించారు. ఆయనతో మాట్లాడి ఆరోగ్యంపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను కోరారు. ఆయనతో పాటు ఎస్.రవీంద్ర భరత్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఏయూ రిజిస్ట్రార్



విద్యార్థులతో రిజిస్ట్రార్ ధనుంజరావు

విశాఖ విద్య: దక్షిణ భారత యువజనోత్సవాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను, యువజన ఉత్సవాలలో పాల్గొన్న విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనంజయ రావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య డి.రాంబాబు, మేనేజర్ డాక్టర్ జి.కె.డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపు యజమానులకు నోటీసులు



కిరాణా షాపు నిర్వాహకులకు నోటీసులు అందజేస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో మంగళవారం జోన్–2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పర్యటించారు. కిరాణా షాపులు, టిఫిన్ సెంటర్లతో పాటు పలు వ్యాపార సంస్థలను పరిశీలించారు. షాపులలో వ్యాపారులు వినియోగిస్తున్న పాలిథిన్ సంచులను తనిఖీ చేశారు. 120 మైక్రోన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారికి నోటీసులు అందజేశారు. నిషేధించిన ప్లాస్టిక్ సంచులు వినియోగించవద్దని, వినియోగించినవారిపై జరిమానాల తప్పదని ఆయన వ్యాపారులను హెచ్చరించారు.

స్పీడ్ బ్రేకర్లకు రేడియం రంగులు



తోటగరువు హైస్కూల్ ముందు స్పీడ్ బ్రేకర్లపై వేసిన రేడియం రంగులు

ఆరిలోవ: ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు ట్రాఫిక్ పోలీసులు ఎట్టకేలకు రేడియం రంగులు వేయించారు. తోటగరువు హైస్కూల్ రోడ్డు, చినగదిలి నుంచి సూర్యతేజానగర్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లపై రంగులు వదిలేశాయి. దీంతో స్పీడ్ బ్రేకర్లు కనిపించకపోవడంతో రాత్రులు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ఈ నెల 26న సాక్షిలో వెలువడిన 'ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు' వార్తకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. సోమవారం ఆయా రోడ్లలో స్పీడ్ బ్రేకర్లపై రేడియం రంగులు వేశారు. దీంతోపాటు హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వరకు ప్రధాన రహదారిపై కూడా పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేసి రేడియం రంగులు వేశారు. దీంతో వాహనచోదకులు ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా విజ్ఞాన ప్రదర్శన



వివిధ ప్రాజెక్టులు పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

ఆరిలోవ: చినగదిలి మండలంలో పాఠశాలల విజ్ఞాన ప్రదర్శన మంగళవారం శ్రీకృష్ణాపురం గురుకులంలో ఉత్సాహంగా జరిగింది. జిల్లాలో పాఠశాలల 8 నుంచి 10వ తగరతి వరకు విద్యార్థులకు విజ్ఞాన ప్రదర్శన పోటీలు సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. పాఠశాల స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులను మండల స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. మంగళవారం మండల స్థాయిల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా చినగదిలి మండలం పరిధిలో పాఠశాలలకు శ్రీకృష్ణాపురం గురుకులంలో నిర్వహించారు. ఈ ప్రదర్శినను మండలం ఎంఈవో 1 రవీంద్రబాబు, ఎంఈవో 2 అనురాధ పర్యవేక్షించారు. ఇక్కడ ప్రదర్శించిన ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. న్యాయనిర్ణేతలుగా శ్రీకృష్ణాపురం గురుకులంలో జూనియర్ కాలేజీ అధ్యాపకులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఈ మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో 8 పాఠశాలల నుంచి 21 వ్యక్తిగత ప్రాజెక్టులు, 27 గ్రూపు ప్రాజెక్టులు , 4 ఉపాధ్యాయుల ప్రాజెక్టులు ప్రదర్శించినట్లు తెలిపారు. వీటిలో మండలం నుంచి మూడు ప్రాజెక్టులను ఈనెల 3న జరగనున్న జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

ఎంవీపీకాలనీ: తమను విధుల్లోకి తీసుకోవాలని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ హెల్త్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకు చెందిన హెల్త్ అసిస్టెంట్లు పెద్ద ఎత్తున తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు విలువైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అయితే ఇటీవల తమను విధుల నుంచి తొలగించడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు వెల్లడించారు. తమను తిరిగి ప్రభుత్వం విధుల్లోకి తీసుకొనే విధంగా కృషి చేయాలని వెలగపూడిని కోరారు. దీంతో ఆయన ప్రభుత్వంతో చర్చించి త్వరలోనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేణు, కృష్ణమోహన్, నాగరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దెతోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దాలి



నారు పంపిణీ చేస్తున్న అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ

ఎంవీపీకాలనీ: మిద్దెతోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ పిలుపునిచ్చారు. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాలలో మంగళవారం నిర్వహించిన కూరగాయ మొక్కలు నారు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిద్దెతోటల పెంపకం విశాఖ నగరంలో పెరగాలన్నారు. ఈ దిశగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎన్జీఓలు సేవలు అందించాలని సూచించారు. దేశీయ విత్తనాలతో కూరగాయలు, ఆకుకూరలు, ప్రకృతి ఆధార పంటలు పండించే విధంగా కృషి జరగాలన్నారు. రసాయనాలకు దూరంగా ఆహారం ఉత్పత్తి చేసుకునే సంప్రదాయం ప్రతి ఇంట్లోను ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాసు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు. బత్తిలి, బాపట్ల మిర్చి, నాటు టమోటా తదితర రకాలకు చెందిన నారును పంపిణీ చేశారు.

నెట్‌బాల్ మహిళా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ డైరెక్టర్ విజయ మోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళల నెట్‌బాల్ జట్టు ఎంపిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్, దూరవిద్యాకేంద్ర డైరెక్టర్ ఆచార్య ఎ. విజయ్ మోహన్ క్రీడాకారులను అభినందించారు. ఈ పోటీలు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో సురేశ్ జ్ఞానవిహార్‌లో జనవరి 7 నుంచి 9 వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ మహిళా విభాగంలో జరుగుతుందని తెలిపారు. ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో మంచి ప్రతిభ చూపి, ఏయూకు ఖ్యాతి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీఎస్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.గోపీకృష్ణ, ఏయూ వ్యాయామ విద్యా విభాగం అతిథి ఫ్యాకల్టీ డాక్టర్ దిలీప్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

5న సంక్రాంతి సంబరాలు

ఆరిలోవ: ఉత్తరాంధ్ర సంగీత జానపద కళాపీఠం ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతం టీఐసీ పాయింట్ వద్ద ఈనెల 5న సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి భగవాన్‌దాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర కళాకారులచే వివిధ కళారూపాల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, ఏకపాత్రాభినయం, గిరిజన కోలాటం, ధింసా నృత్యం, జముకుల కథ, సన్నాయి మేళం, రాజమ్మ ఆట, నాగిని డ్యాన్స్ తదితర కళలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

అపుస్మా జోన్-1 అధ్యక్షుడిగా ఎంవీ రావు



ఎంవీ రావుకు నియామక పత్రం అందించి అభినందిస్తున్న అపుస్మా ప్రతినిధులు

ఆరిలోవ: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమన్య సంఘం (అపుస్మా) జోన్–1 అధ్యక్షుడిగా ఆరిలోవ ప్రాంతం భారతీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ ఎం.వి రావు నియమితులయ్యారు. జోన్–1 పరిధిలో ఉమ్మడి విశాఖపట్నం, ఉమ్మడి వియనగరం , శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి మంగళవారం జరిగిన అపుస్మా సర్వసభ్య సమావేశంలో తనను ఏకగ్రీవంగా న్నుకొన్నట్లు ఎంవీ రావు తెలిపారు. ఈ సందర్భంగా అపుస్మా రాష్ట్ర ప్రతినిధులు తనకు నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు.

ఆకుపచ్చని బహుమతి



బీచ్‌రోడ్డులో మొక్కలు విక్రయిస్తున్న పృథ్వీ

ఏయూక్యాంపస్: నూతన సంవత్సరం అంటే స్నేహితులకు శుభాకాంక్షలు చెప్పడం. శుభాకాంక్షలు చెప్పే సమయంలో ఒక గ్రీటింగ్ కార్డ్ ఇవ్వడం దశాబ్దాల క్రితం సంప్రదాయం. నేడు కాలంతో పాటు ప్రజల ఆలోచనలు, అభిరుచుల్లో ఎంతో మార్పు వచ్చింది. పుష్పగుచ్ఛాలు ఇవ్వడం, పండ్లు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు ఇవ్వడం తరువాతి కాలంలో వచ్చింది. సందర్భానికి తగినట్టుగా ఏదైనా గిఫ్ట్ ఇవ్వడం, అలంకరణ వస్తువులు, డెకరేటివ్ ఐటమ్స్ ఇవ్వడం నేడు అలవాటుగా మారింది. ఇటీవల కాలంలో పర్యావరణ స్పృహ ప్రజల్లో బాగా పెరిగింది. నేడు న్యూ ఇయర్‌వేడుకలు సైతం సరికొత్తగా కొంతమంది జరుపుకుంటున్నారు. దీనిలో భాగంగా మిత్రులు, హితులు, అధికారులకు ఇచ్చే బహుమతులకు బదులుగా మొక్కను వారికి బహూకరిస్తున్నారు. న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో పృథ్వీ అనే యువకుడు తన సొంత వాహనంతో గిఫ్ట్‌లుగా ఇవ్వడానికి అనువైన మొక్కలను విక్రయిస్తూ కనిపించాడు. ఉదయం వేళల్లో సిరిపురం కూడలి వద్ద, సాయంత్రం వేళలలో బీచ్‌రోడ్డులో వీటి విక్రయాలు చేస్తున్నట్లు చెప్పాడు.

న్యూ ఇయర్ సందడి



నగరంలో న్యూ ఇయర్ జోష్ నెలకుంది. చిన్నా పెద్దా తేడా లేకుండా వేడుకల్లో మునిగితేలారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పకున్నారు. ఆయా అపార్ట్‌మెంట్లలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఇళ్ల ముందు ముగ్గులు వేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

-ఏయూ క్యాంపస్/ఆరిలోవ

